ప్రజాశక్తి
ఆదివారం 26 జనవరి, 2025
5
శ్రీకాకుళం



అంగన్వాడీలకు నియామక పత్రాలు

పలాస : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందేలా అంగన్వాడీ కార్యకర్తలు చూడాలని, పిల్లలకు మంచి విద్య బుద్ధులు నేర్పించాలని ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు అన్నారు. పలాస ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం అంగన్వాడీ సూపర్‌వైజర్ సమక్షంలో మండలంలోని కొటారింగి, తాళ్లభద్ర, సిరిపురం గ్రామాలకు అంగన్వాడీ కార్యకర్తలుగా ఎంపికైన సవరజానకి, సవర రజినీ, లొత్తూరు పంచాయతీ పెద్దపల్లియకి చెందిన సవర ప్రమీలకు నియామకపత్రాలను శనివారం అందజేశారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కుత్తుం లక్షణ్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి దువ్వాడ సంతోష్, బడ్డ నాగరాజు, లోడగల కామేష్, ఎస్.మోహనరావు, మురిపింటి కుమార్‌రాజ, సవర సోమేష్, ఎ.దశరథ పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న జెసి, ఎమ్మెల్యే

ఓటు... నిర్ణయాత్మక శక్తి

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఓటు హక్కు భవిష్యత్ నిర్ణయాత్మక శక్తిగా నిలుస్తుందని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు కళాశాలల విద్యార్థులు, ఎన్నికల అధికారులు నిర్వహించిన ర్యాలీని సూర్యమహల్ జంక్షన్ వద్ద జెండా ఊపి శనివారం ప్రారంభించారు. అనంతరం ఏడు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం బాపూజీ కళామందిర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న వృద్ధులను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగించుకొని భాగస్వాములు కావాలన్నారు. ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావడంతో పాటు మిగతా వారూ నమోదు చేసుకునేలా బాధ్యత వహించాలన్నారు.

జీవితంలో ఒక వ్యక్తి 10 నుంచి 12 సార్లు మాత్రమే ఓటు వేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటు హక్కుకు అర్హులేనని స్పష్టం చేశారు. దేశాభివృద్ధి కోసం విధిగా ఓటు హక్కు వినియోగించుకొని సహకరించాలని కోరారు. గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ లెవల్ అధికారులు ఉంటారని, ఎప్పుడైనా ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రజలకు కల్పించిన ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిఆర్ఒ ఎం.వెంకటేశ్వరరావు, ఆర్‌డిఒ సాయి ప్రత్యూష, జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.వి.వి.డి ప్రసాద్, ఎఎస్‌పి కె.వెంకటరమణ, సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు, జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు, సన్ డిగ్రీ కళాశాల డైరెక్టర్ జయరాం తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు బాధ్యత

శ్రీకాకుళం : జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులు, సిబ్బందితో ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాధ్యతతో రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఎస్‌పిలు కె.వి రమణ, పి.శ్రీనివాసరావు, డిఎస్‌పి ఎల్.శేషాద్రి, ఇతర పోలీసు అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వి.జి.కె మూర్తి... యువతకు స్ఫూర్తి

- దేశానికి మూర్తి వంటి వ్యక్తులు అవసరం
- సంస్మరణ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం : ఎమ్మెల్యే గొండు శంకర్


వి.జి.కె మూర్తి సంస్మరణ సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, అర్బన్

వి.జి.కె మూర్తిని స్ఫూర్తిగా తీసుకుని యువత సమాజ సేవకు ముందుకు రావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజాసంఘాల ఆధ్వర్యాన శనివారం నిర్వహించిన సిపిఎం నేత కీ.శే వి.జి.కె మూర్తి సంస్మరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయాలనే కోరుకునే వ్యక్తుల్లో మూర్తి ఒకరని అన్నారు. అశేషమైన, అఖండ ప్రజ్ఞాపాటవాలు కలిగిన వ్యక్తి మూర్తి అని కొనియాడారు. డబ్బుల సంపాదనే లక్ష్యంగా సాగుతున్న ప్రస్తుతం రాజకీయాలు ఉన్న నేపథ్యంలో ఉద్యోగంలో అవకాశాలను వదులుకుని ఉద్యమాలకు పనిచేశారని గుర్తుచేశారు. మూర్తి వంటి వ్యక్తులు దేశానికి అవసరమని, రాజకీయాల్లో ఆయన ఒక ఆణిముత్యమన్నారు. మూర్తి లేని లోటును భర్తీ చేయడం సంఘాల నాయకులకు ముందున్న కర్తవ్యమన్నారు. తన కుటుంబాన్ని ఉన్నతమైన విలువలతో తీర్చిదిద్దడంతో పాటు వారిని అభ్యుదయవాదులుగా మార్చి అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.

ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం

ఉద్యోగ, కార్మికుల సమస్యలపై అనేక పోరాటాలు చేసి వారి హృదయాల్లో వి.జి.కె మూర్తి సుస్థిర స్థానం సంపాదించారని ఎమ్మెల్యే గొండు శంకర్ చెప్పారు. ఆయన భౌతికకాయాన్ని రిమ్స్‌కు అప్పగించడం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. జిల్లా, నియోజకవర్గ ప్రజలు ఆయన సేవలను మరువలేరని కొనియాడారు.

ప్రగతిశీల శక్తులకు తీరనిలోటు

ఉద్యోగులు, కార్మికులతో సమన్వయ కమిటీ ఏర్పాటు చేసి వి.జి.కె సాగించిన పోరాటాలు చిరస్థాయిగా నిలిచిపోతాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ అన్నారు. అందరినీ ఒప్పించి, మెప్పించి ఉద్యమాలను నిర్మించడంలో చాలా నేర్పుగా వ్యవహరించారని కొనియాడారు. కార్మికుల్లో మంచి విశ్వాసం చూరగొన్నారని చెప్పారు. ఆయన మరణం సిపిఎం, వామపక్ష ఉద్యమాలతో పాటు ప్రగతిశీల శక్తులకు తీరని లోటు అని అన్నారు. సిక్కోలు ఒక ఉద్యమ ప్రియ పుత్రుడిని కోల్పోయిందన్నారు.

వి.జి.కె ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

మత విశ్వాసాల పేరుతో విద్వేషాలు రగిలిస్తున్న నేపథ్యంలో మానవత్వం కలిగిన వారంతా గొంతు కలపాల్సిన అవసరముందని పూర్వ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ అన్నారు. వి.జి.కె ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ఉద్యమ కార్యాచరణ రూపొందించాల్సిన అవసరముందన్నారు. మానవత్వ విలువలను వ్యాప్తి చేయడం ద్వారానే ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లినట్లు అవుతుందన్నారు.


శ్రమజీవుల కోసం పనిచేశారు

ఉద్యోగంలో ఉన్నత స్థాయికి వెళ్లే అవకాశం ఉన్నా, దాన్ని వదులుకుని శ్రమజీవుల కోసం వి.జి.కె పనిచేశారని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు గుర్తు చేశారు. శ్యామ్‌పిస్టన్స్ కార్మికుల సమస్యలపై ఎనిమిది నెలల పాటు విరామం లేకుండా పనిచేశారని చెప్పారు. వి.జి.కె మూర్తి పోరాటం వల్లే కార్మికుల జీతాలు పెరిగాయని, తొలగించిన ఉద్యోగులను యాజమాన్యం తీసుకుందని గుర్తు చేశారు. ఉద్యమాల విస్తరణలో వి.జి.కె మూర్తి, శ్రీనివాసు ఉమ్మడిగా పనిచేశారని చెప్పారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ వి.జి.కె మూర్తి మరణించినా, ఎర్రజెండా నీడలో ఆయన ఆశయాలు సజీవంగానే ఉంటాయన్నారు. తుదిశ్వాస వరకు ప్రజల సమస్యలపై పోరాడారని చెప్పారు. సభాధ్యక్షులు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి మాట్లాడుతూ వి.జి.కె మూర్తి భాగస్వామ్యం లేకుండా ఏ ఉద్యమాలు, ప్రజా పోరాటాలు లేవన్నారు. సిఐటియు సీనియర్ నాయకులు కె.శ్రీనివాసు మాట్లాడుతూ వి.జి.కె మూర్తి జీవిత విశేషాలు, ఉద్యమ నేపథ్యాన్ని వివరిస్తూ ఆశయసాధనకు అంతా కృషి చేయాలన్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి కె.విజయగౌరి మాట్లాడుతూ ఒక అంశంపై పూర్తిగా అధ్యయనం చేసిన తర్వాతే కార్యక్రమానికి రూపకల్పన చేసే వారని గుర్తుచేశారు. సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు పి.సతీష్, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, ప్రముఖ కవి, రచయిత అట్టాడ అప్పలనాయుడు, ప్రముఖ విద్యావేత్త జామి భీమశంకరరావు, వైద్యులు సుధీర్, ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కె.నాగమణి తదితరులు మాట్లాడారు.

మూర్తిపై రాసిన గీతాల ఆలాపన

వి.జి.కె మూర్తి ఉద్యమ నేపథ్యం, వ్యక్తిత్వంపై రచయిత నల్లి ధర్మారావు రాసిన వి.జి.కె మూర్తి అంటే మూడు అక్షరాలే కాదు అంటూ సాగిన పాటను ప్రజా కళాకారులు రామచంద్రమూర్తి, సాలె శ్రీనివాసరావు ఆలపించారు. అవధాని పైడి హరనాథ్ రాసిన సీస పద్యాన్ని వినిపించారు. వి.జి.కె మూర్తి జీవిత విశేషాలు, ఉద్యమాలకు సంబంధించి ప్రజాశక్తి ప్రచురించిన ప్రత్యేక సంచికను నాయకులు ఆవిష్కరించారు. వి.జి.కె చిత్రపటానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుతో సహా పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆయన జీవిత చరిత్ర తెలిపే వీడియోను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. కార్యక్రమంలో వి.జి.కె కుమారుడు శ్రీనివాస కుమార్, కుమార్తెలు భారతి, స్రవంతి, అల్లుళ్లు ఆలూరి రవికుమార్, దేవులపల్లి శ్రీనివాసరావు, ఇతర కుటుంబసభ్యులు, సిపిఎం శ్రేణులు, ఉద్యోగ, కార్మిక, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.


చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఉత్తమ ఎన్నికల అధికారిగా కలెక్టర్‌కు అవార్డు

శ్రీకాకుళం అర్బన్: 2024 ఓటర్ల జాబితా రూపకల్పన, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియలో అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు గానూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఎన్నికల అధికారిగా అవార్డు లభించింది. 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విజయవాడలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఆయనతో పాటు శ్రీకాకుళం తహశీల్దార్ సిహెచ్.గణపతి, పలాస, శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గాల బిఎల్‌ఒలు ఐ.నీలవేణి, వంజరాపు జగన్నాథరావు, కలెక్టరేట్ సి-సెక్షన్ టెక్నికల్ సపోర్టర్ ఎం.సత్యనారాయణ అవార్డు అందుకున్న వారిలో ఉన్నారు.


అవార్డును అందుకుంటున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

స్వచ్ఛంద సేవకులుగా పారాలీగల్ వాలంటీర్లు


మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో న్యాయసేవలను స్వచ్ఛందంగా తెలియజేయడంతో పాటు పలు సేవా కార్యక్రమాల్లో పారాలీగల్ వాలంటీర్లు భాగస్వాములు కావాలని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా పిలుపునిచ్చారు. కోర్టు ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్‌లో పారా లీగల్ వాలంటీర్ల శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారా లీగల్ వాలంటీర్లు స్వచ్ఛందంగా సేవ చేయడానికి ముందుకు రావాలన్నారు. సామాజిక బాధ్యత కలిగి ఉండడమే కాకుండా, న్యాయస్థానం గౌరవ ప్రతిష్టలు కాపాడేలా ప్రవర్తించాలన్నారు. పారాలీగల్ వాలంటీర్ ప్రజలకు హక్కులు, బాధ్యతలు తెలుసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, న్యాయవాదులు ఎ.భువనేశ్వర్, జి.ఇందిరా ప్రసాద్, పారాలీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తమ వినతని ఆయనకు అందజేశారు. వచ్చిన వినతపత్రాలను స్వయంగా పరిశీలించి గ్రీవెన్స్‌కు హాజరైన రెవెన్యూ, ఇరిగేషన్, రహదారులు, పంచాయతీ, విద్యుత్‌శాఖ అధికారాలకు అక్కడికక్కడే ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా ఆదేశించారు. ప్రజల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ముఖ్యంగా రబీలు సాగు చేసేందుకు రైతులు సాగునీరు అందించాలని మంత్రిని కోరారు. కోటబొమ్మాళి మండలం తెంబూరు మీదుగా ఉన్న అసర్లసాగర్ నుంచి నీటిని విడుదల చేయాలని కోరారు. వెంటనే ఇరిగేషన్ అధికారులతో ఫోన్ మాట్లాడి నీటిని విడుదల చేయాలని ఆదేశించారు. సుమారు పది గ్రామాలకు రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని సూచించారు. కాంట్రాక్టు అధ్యాపకలుగా విధులు నిర్వహిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, టిడిపి నాయకులు పీరుకట్ల విశ్వప్రసాద్, బగ్గు లక్ష్మణరావు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైదానం ముస్తాబు అయింది. పతాకావిష్కరణతో పాటు సైనిక వందన స్వీకరణకు వేదికను సిద్ధం చేశారు. జిల్లా అభివృద్ధిని ప్రతిబింబించేలా ప్రభుత్వ శాఖలకు సంబంధించిన శకటాలను ప్రదర్శనకు సిద్ధం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను తెలియజేయడంతో పాటు లబ్ధిదారులకు ఉపకరణాలు అందించేందుకు బ్యాంకర్లు, పలు సంక్షేమ రంగాలకు చెందిన ప్రభుత్వ శాఖల ఆధ్వర్యాన స్టాల్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చేందుకు పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులను ఎంపిక చేశారు.


మువ్వన్నెల పతాకాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఎగురవేసేందుకు ఏర్పాట్లు చేశారు. పతాకావిష్కరణ అనంతరం ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డితో కలిసి పోలీసు బలగాల నుంచి సైనిక వందనాన్ని స్వీకరిస్తారు. అందుకోసం ప్రత్యేక శకటాన్ని సిద్ధం చేశారు. పోలీసుల సైనిక వందనం, విన్యాసాల ప్రదర్శన అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇవ్వనున్నారు. ప్రదాన వేదిక ముందర ఈ కార్యక్రమాలకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. అనంతరం జిల్లా అభివృద్ధిని తెలియజెసేలా పలు ప్రభుత్వ శాఖల శకటాలను ప్రదర్శనకు సిద్ధం చేశారు. వాటిలో ఉత్తమ శకటాలకు బహుమతులు అందజేయనున్నారు. జిల్లావ్యాప్తంగా పలు ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన **333** మంది ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేస్తారు.

ఏర్పాట్లు పరిశీలన

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పలు శాఖల అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. వేదికతో పాటు సీటింగ్ ఏర్పాట్లు, పలు శాఖల పరిధిలో సిద్ధం చేస్తున్న శకటాలు, స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. మైదానం అంతా పరిశుభ్రంగా సిద్ధం చేయాలన్నారు. ప్రజలందరూ వేడుకలను వీక్షించే విధంగా అవసరమైన అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.సాయి ప్రత్యూష, ఎపిఎంఐపి ఉప సంచాలకులు శ్రీనివాసరావు, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి.డి ప్రసాదరావు, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, సెట్విస్ సిఇఒ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కవాతు రిహార్సల్స్ పరిశీలన

గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న పోలీస్ కవాతు రిహార్సల్స్‌ను ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఎఎస్‌పి కె.వి రమణతో కలిసి ఆర్ట్స్ కళాశాల మైదానంలో శనివారం పరిశీలించారు. పరేడ్ కమాండర్ గౌరవ వందనం సమర్పించారు. పరేడ్‌లో పాల్గొన్న ప్రతిఒక్కరూ ఐకమత్యంతో, వీక్షకులను ఆకర్షించే విధంగా పరేడ్ చేయాలన్నారు. గణతంత్ర వేడుకలకు ముఖ్య అతిథులు, ప్రజలు, విద్యార్థులు హాజరవుతున్న నేపథ్యంలో భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలని, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్మ్‌డ్ రిజర్వు డిఎస్‌పి ఎల్.శేషాద్రి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

బంగారం కోసమే వివాహిత హత్య

- 82.5 గ్రాముల బంగారం స్వాధీనం
- ఎఎస్‌పి కె.వి రమణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరంలోని న్యూ కాలనీలో ఈనెల 18న వివాహిత పూజారి కళావతి హత్య కేసులో నిందితుడు అండులూరి శరత్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు అదనపు ఎస్‌పిలు కె.వి రమణ, పి.శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో డిఎస్‌పి సిహెచ్.వివేకానందతో కలిసి శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడిని ప్రవేశపెట్టి కేసు వివరాలను వెల్లడించారు. శ్రీకాకుళం నగరానికి చెందిన శరత్ కుమార్‌కు పొందూరు మండలం మొదలవలసకు చెందిన కళావతి నగరంలోని సత్సంగం ప్రవచనాలకు వెళ్లేది. అక్కడే శరత్ కుమార్‌తో 2023లో పరిచయమైంది. వీరిద్దరూ సన్నిహితంగా మెలిగేవారు. ఈనెల 18న శరత్ కుమార్‌కు ఫోన్ చేసి న్యూ కాలనీలోని అతని గదికి వస్తున్నట్లు ఫోన్ చేసింది. జల్సాలకు అలవాటైన శరత్ కుమార్ డబ్బుల కోసం ఆమెను అంతమొందించడానికి ప్లాన్ వేశాడు. గదిలోకి వచ్చిన తర్వాత వైర్‌ను ఆమె మెడకు చుట్టి ముఖంపై దిండును అదిమిపెట్టి ఊపిరాడకుండా చేయడంతో ఆమె మృతి చెందింది. ఆమె మెడలో ఉన్న పుస్తెలతాడు, రెండు బంగారు గాజులు, నాలుగు ఉంగరాలు, సెల్‌ఫోన్ తీసుకుని మృతదేహాన్ని బాత్రూంలోకి ఈడ్చుకెళ్లి గదికి తాళం వేసి వెళ్లిపోయాడు. రెండు గాజులు తన వద్దే ఉంచుకుని మిగతా బంగారు వస్తువులను పాలిథిన్ కవర్‌లో చుట్టి ఇంటి మెట్ల కింద ఉంచాడు. మృతురాలి సెల్‌ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేసి హైవేపై ఆగి ఉన్న లారీ పైకి విసిరేశాడు. మృతురాలు కనిపించడం లేదంటూ కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. 82.5 గ్రాముల బంగారు ఆభరణాలను రికవరీ చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో రెండో పట్టణ సిఐ ఈశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.


కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎఎస్‌పి రమణ

మద్యం దుకాణాలే గీత కార్మికుల సంక్షేమమా?

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ప్రజలు కోరుకుంటున్నది ఒకటైతే, పాలకుల ఆలోచనలు మరోరకంగా ఉంటాయనడానికి కల్లుగీత కార్మికులకు కేటాయించిన మద్యం దుకాణాలే ఉదాహరణ. ప్రతి పనికీ, నిర్ణయానికీ ప్రభుత్వానికి ఓ లెక్క ఉంటుంది. ప్రజలు, ఆయా తరగతులకు మేలు చేసే కంటే తమకు, తమ అనుయాయులకు అందులో ఏం ప్రయోజనం ఉంటుందో చూసుకుని అన్నీ బేరీజు వేసుకున్న తర్వాతే వాటిని అమలు చేస్తారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన మద్యం పాలసీ పేరుతో ప్రయివేట్‌కు మద్యం దుకాణాలను కేటాయించిన సంగతి తెలిసిందే. కొత్త ఎక్సైజ్ పాలసీని ప్రకటించినప్పుడే కల్లు గీత కార్మికులకు పది శాతం దుకాణాలను కేటాయిస్తామని ప్రకటించిన ప్రభుత్వం, ఆ వెనువెంటనే జిఒనూ విడుదల చేసింది. జిఒ అమల్లో భాగంగా శుక్రవారం గీత కార్మికులకు 16 దుకాణాలను లాటరీ పద్ధతిలో కేటాయించింది. గతేడాది అక్టోబరులో లాటరీ ద్వారా జిల్లాలో 158 మద్యం దుకాణాలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించారు. ఇప్పుడు తాజాగా కల్లుగీత కార్మికుల పేరుతో మరో 16 దుకాణాలు కేటాయించడంతో, జిల్లాలో షాపుల సంఖ్య 174కు చేరింది. దుకాణాల పెరుగుదలతో పాటు ప్రభుత్వానికి రాబడీ పెరగనుంది. గీత కార్మికుల పేరుతో దుకాణాలను పెంచి ఆదాయం పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్న ప్రభుత్వం, వారికేదో మేలు చేసినట్లుగా చెప్పుకుంటోంది. కల్లుగీత కార్మికులకు పది శాతం మద్యం షాపులు కేటాయించడం ద్వారా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుందంటూ వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు బిసిల తరుపున ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వంలో బిసిలకు అధిక ప్రాధాన్యం ఉంటుందంటూ గొప్పగా ప్రకటన విడుదల చేశారు. నాలుగు మద్యం దుకాణాలు ఇచ్చి, వాటితోనే బిసిలకు మేలు జరిగిపోతుందన్నట్లుగా చెప్పడం ఆ తరగతులను మభ్య పెట్టడమే అవుతుంది. బిసిలకు అమలు చేయాల్సిన అనేక హామీలను పక్కన పెట్టిన టిడిపి ప్రభుత్వం, మద్యం దుకాణాల కేటాయింపు హామీని మాత్రం చాలా వేగంగా అమలు చేసింది. 50 ఏళ్లు దాటిన వారికి వృద్ధాప్య పింఛను అందిస్తామంటూ ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం, దాని అమలుపై మాత్రం నోరెత్తడం లేదు. పింఛను హామీని అమలు చేస్తారా? లేదా?, చేస్తే ఎప్పుడు అందిస్తారో కనీసం ఎక్కడా మాట మాత్రంగానైనా చెప్పడం లేదు. పింఛన్లు ఇవ్వాలంటే డబ్బులు ఖర్చయ్యే పని కావడంతో దాన్ని పక్కన పెట్టిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అదే మద్యం దుకాణాలైతే ప్రభుత్వానికి ఆదాయం తెచ్చి పెట్టే వనరు. దీంతో కల్లుగీత కార్మికుల పేరుతో వెంటనే హామీని అమలు చేసేసిందన్న చర్చ ప్రజల్లో సాగుతోంది.

కల్లుగీత కార్మికులు, ఆ వృత్తి చేస్తున్న బిసిలపై ప్రభుత్వానికి నిజంగా ప్రేమ ఉంటే చాలాకాలంగా వారు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. కల్లుగీత కార్మికులకు 50 ఏళ్లకే పింఛన్ అందించాలని చాలా కాలంగా వారు కోరుతున్నారు. ఈత కల్లును బాదం మిల్క్ తరహాలో అమ్మకాలు చేపట్టేందుకు కేరళ తరహాలో నీరా పరిశ్రమను అభివృద్ధి చేయాలన్న డిమాండ్ ఉంది. కల్లుగీత కార్మికులు తాటి చెట్టుపై నుంచి పడి మృతి చెందితే, ఆ కుటుంబానికి రూ.10 లక్షలు, ప్రమాదంలో కాలు, చేయి విరిగితే రూ.ఐదు లక్షలు ఇవ్వాలని వారు చాలా కాలంగా అడుగుతున్నారు. ఈత, తాటి చెట్లపై రూ.పదికి మించి పన్ను విధించొద్దని కోరుతున్నారు. ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో ఈత, తాటిచెట్లను పెంచి వాటిని తమకు అందించాలని వారు చాలా కాలంగా అడుగుతూనే ఉన్నారు. ఈ డిమాండ్లలో ఒక్కటీ నెరవేర్చకుండా వారు అడగని మద్యం దుకాణాలకు వారికి కేటాయించి వారికేదో మేలు చేసినట్లుగా కూటమి నాయకులు ప్రచారం చేసుకుంటున్నారు. గీత కార్మికులు వృత్తి రక్షణ కోరుకుంటుంటే, వారికి మద్యం దుకాణాలు కేటాయించి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామంటూ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది. గీత కార్మికుల్లో ఒకరికో, ఇద్దరికో మద్యం దుకాణాలు ఇచ్చి, వారి సంక్షేమం కోసం పాటుపడుతున్నట్లుగా బిల్డప్ ఇవ్వడం కూటమి నేతలకే చెల్లింది.

సాంకేతికతతో సైబర్ నేరాల ఛేదన

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి


మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

శ్రీకాకుళం: సైబర్ మోసాలు అరికట్టేందుకు, కేసులు సులభతరంగా ఛేదించేందుకు సాంకేతిక పరిజ్ఞానం ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి అన్నారు. ప్రతిఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సైబర్ కేసులను త్వరితగతిన ఛేదించాలని సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సైబర్ కేసుల నమోదు, దర్యాప్తు తదితర అంశాలపై ఎఎస్‌పి కె.వి రమణతో కలిసి శనివారం సమీక్షించారు. సోషల్ మీడియా వేదికగా వేధింపులు, ఒటిపి ఫ్రాడ్స్, ఆర్థిక మోసాలు, మొబైల్ యాప్స్, లింక్స్ వంటి నేరాల్లో దర్యాప్తు విధానాన్ని వివరించారు. సైబర్ పోలీసు పోర్టల్‌లో నమోదైన ఫిర్యాదు వివరాలను పరిశీలించి, కేసులు త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో బాధిత వ్యక్తులు పోగొట్టుకున్న నగదును గోల్డెన్ అవర్‌లో ఫ్రీజ్ చేయించాలని సూచించారు. కేసుల దర్యాప్తు అనంతరం చట్ట ప్రకారం కోర్టు ద్వారా ఫ్రీజింగ్ చేసిన నగదును బాధితులకు అప్పగించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. సైబర్ కేసులు ఛేదించడంలో ప్రతి అంశాన్నీ కీలకంగా తీసుకోవాలన్నారు. ప్రస్తుతం నేరాల తీరు మారుతోందని, ప్రతి నేరం సైబర్ క్రైం, సాంకేతికతతో ముడిపడి ఉంటోందని తెలిపారు. అవగాహన, అప్రమత్తతోనే సైబర్ నేరాలు నియంత్రించగలమన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో గ్రామస్థాయిలో సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలని సూచించారు. సైబర్ మోసానికి గురైతే 1930 టోల్ ఫ్రీ నంబరు ద్వారా ఫిర్యాదు చేసే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో డిఎస్‌పిలు, సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి ఓటే జీవనాడి



టెక్కలి రూరల్ : మాట్లాడుతున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి



లావేరు : మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు



ఎచ్చెర్ల : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ప్రజాస్వామ్యానికి ఓటే జీవనాడి అని ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఐతమ్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ సేవా విభాగం ఆధ్వర్యాన శనివారం ఏర్పాటు చేసిన ఓటు నమోదు అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఏ రంగంలోనైనా దేశ భవిష్యత్ మార్చే సత్తా యువతకు ఉందని అన్నారు. మంచి ప్రభుత్వం ఏర్పడాలంటే ప్రతిఒక్కరూ యువత ఓటు హక్కును వినియోగించు కోవాలన్నారు. ప్రతి మూడు మాసాలకోసారి ఓటు నమోదు చేసుకొనేందుకు భారత ఎన్నికల సంఘం వీలు కల్పిస్తూ ఆదేశించిందని చెప్పారు. ఓటు నమోదును ఆన్‌లైన్, బూత్ లెవల్ అధికారుల వద్ద చేసుకోనే వీలుందని అన్నారు. అనంతరం ఓటు హక్కుపై విద్యార్థులతో, సిబ్బందితో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఐతమ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఎన్నికల డిటి ఎస్.రవికుమార్, సూపరింటెండెంట్ కోటేశ్వరరావు, ఎస్టేట్ మేనేజర్ పిరియా రమేష్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ పిఒ ఎస్.వి.మారుతీప్రసాద్, జాకా సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

పలాస : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి కాశీబుగ్గ రాజీవ్ కూడలి వరకు ర్యాలీ నిర్వమించి మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిటిపిపి చైర్మన్ వజ బాబూరావు, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఆర్‌డిఒ జి.వెంకటేష్, తహశీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి, కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ, టిడిపి నాయకులు పీరుకట్ల విఠలరావు, లొడగల కామేశ్వరరావుయాదవ్, బడ్డ నాగరాజు, గాలి కృష్ణారావు, సప్ప నవీన్, డిటి వి.గిరి, జగ్గేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి : ప్రభుత్వ జూనియర్ కళాశాల సరుబుజ్జిలిలో జాతీయ ఓటర్ల దినోత్సవం ప్రిన్సిపాల్ ఎం.నాగేంద్ర అధ్యక్షతన నిర్వహించారు. సరుబుజ్జిలి కూడలి వద్ద బహిరంగ ర్యాలీ నిర్వహించారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో ఓటర్లు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ కార్యాలయ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నరసన్నపేట : సామాన్యుడి చేతిలో ఓటే వజ్రాయుధమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మదపల్ల పవన్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ఓటు హక్కుపై అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు. నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ ష్యూర్ అనే నినాదాలు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు సురవరపు సత్యనారాయణ, వడనగిరి, అప్పన్న, డాక్టర్ మల్లేష్, సోమశేఖర్, శాంతారావు, ఆనంద్, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎల్‌ఐటి కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యాన విద్యార్థులు కళాశాల నుంచి జమ్మిజంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఎకాడమిక్ డైరెక్టర్ జి.వి.జగన్నాధరావు, ఎన్‌ఎస్‌ఎస్ పిఒ పాగోటి మోహనరావు, డి.కోటేశ్వరరావు, ఎస్.ఆనందరావు, బి.రవీంద్ర పాల్గొన్నారు.

మెళియాపుట్టి : 18 ఏళ్ళ నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని తహశీల్దార్ బడే పాపారావు, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా తహశీల్దార్ కార్యాలయం నుంచి మెళియాపుట్టి మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంఇఒలు ఎస్.దేవేంద్రరావు, ఎం.పద్మనాభరావు, డిటి రాము, జగన్మోహనరావు, కార్యదర్శి చింతల అప్పారావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : అర్హులైన ప్రతిఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి బెవర పద్మావతి అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ, మానవహారం, ప్రతిజ్ఞలు చేయించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎన్.వెంకటరావు, ఎస్‌టిఒ యు.ప్రసాద్, ఎంఇఒ అప్పారావు పాల్గొన్నారు. అనంతరం కొత్త ఓటర్లకు పిక్ కార్డులను అందజేశారు. అలాగే సీనియర్ సిటిజన్ ఓటర్లకు సన్మానించారు. టీవల కాలేజీలో నిర్వహించిన ప్రజాస్వామ్యంలో ఓటు విలువపై వ్యాసరచన, క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి ధ్రువపత్రాలు, బిఎల్‌ఒలకు అవార్డుపత్రాలు అందజేశారు.



పలాస : మానవహారం నిర్వహిస్తున్న అధికారులు

స్థానిక ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ పిఒ ఎస్.రజనీకుమారి ఆధ్వర్యాన నిర్వహించిన ఓటర్ల దినోత్సవంలో ప్రిన్సిపాల్ వి.శంకరరావు, అధ్యాపకులు బి.కరుణాకరరావు, వి.ప్రసాదరావు, కె.జగదీశ్వరరావు, వై.జనార్దనరావు, పి.సుధాకరరావు పాల్గొన్నారు.

నందిగాం : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.సోమేశ్వరరావు, రామారావు, సింహచలం పాల్గొన్నారు.

కవిటి: ఓటు అనే వజ్రాయుధంతో మన భవిష్యత్తును నిర్మించుకోవచ్చని తహశీల్దార్ మురళీమోహన్, ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా రెడెమ్మ ప్రభుత్వ జూనియర్ కళాశాల, స్థానిక ఎవిఐటి, బిఎస్ఆర్, కల్యాణి కళాశాలల విద్యార్థులు కవిటిలో ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఎవిఐ రవివర్మ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పేడాడ రాజేశ్వర రావు, డిటి కృష్ణమూర్తి, ఆర్ఐ రమణమూర్తి, ఇఒ వీరభద్రస్వామి, అంగన్వాడీ సూపర్‌వైజర్లు లక్ష్మి, కృష్ణవేణి, పల్లవి పాల్గొన్నారు.

కొత్తూరు : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు తహశీల్దార్ కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. మానవహారం చేపట్టి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రవిచంద్ర, ఎంపిడిఒ నిరంజ, డిగ్రీ కళాశాల డైరెక్టర్ జి.కృష్ణారావు, సిఎస్‌డిటి భీమారావు పాల్గొన్నారు.

టెక్కలి : జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా టెక్కలి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ తెంబూరు గోవిందమ్మ ఓటుహక్కు వినియోగం అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, రాజనీతి విభాగం అధిపతులు ఓ.కోటేవ్వరరావు, కో-ఆర్డినేటర్ వి.లుక్‌పాల్, రామారావు, శ్రీనివాసరావు కె.కందిగొళ్ల, ఎస్.ధర్మారావు పాల్గొన్నారు.

సోంపేట : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా తహశీల్దార్ ఎం.ఉమామహేశ్వరరావు ఆధ్వర్యాన సిబ్బంది, విద్యార్థులు ర్యాలీ, మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు.

కంచిలి : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కంచిలి కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ ఎన్.రమేష్‌కుమార్, ఎస్ఐ పారినాయుడు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ప్రాంగణం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ గోపాలరావు, డీన్ మోహన్ కృష్ణ చౌదరి, డాక్టర్ ఎం.పి సూరి గణేష్, ఆర్ఒ జి.శ్రీనివాసరావు, ఫైనాన్స్ ఆఫీసర్ వి.వాసు, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ డా పెద్దింటి ముకుందరావు, ప్రోగ్రాం ఆఫీసర్లు డా.వి.సింహచలం, డా.బి.శ్రీధర్, తంగి అసిరినాయుడు, డా.శ్రీనివాసరావు, అధ్యాపకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

రణస్థలం: మండలం తహశీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ ఓటరు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ఇఆర్ఒ ఎన్.వి.లక్ష్మణమూర్తి, తహశీల్దార్ ఎన్.ప్రసాదరావు ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం చేపట్టారు. ఓటు ప్రాముఖ్యతను వివరించేలా విద్యార్థులకు రంగోలి, వ్యాసరచన, వక్తృత్వం, పాటల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఈశ్వరరావు, ఎస్ఐ చిరంజీవి, డిటి హేమసుందర్, విఆర్‌ఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ బిఎల్‌ఒగా అమ్మాజీ

కోష్ట పంచాయతీలో పిఎస్.183 బిఎల్‌ఒగా విధులు నిర్వహిస్తున్న సచివాలయం మహిళా పోలీస్ బమ్మిడి అమ్మాజీని ఉత్తమ బిఎల్‌ఒగా ఎంపిక చేశారు. ఎమ్మెల్యే, ఇఆర్ఒ, తహశీల్దార్ ఇతర అధికారుల చేతులమీదుగా ప్రశంసాపత్రం అందజేసి సత్కరించారు.

బూర్జ: స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల జిల్లా వృత్తి విద్యాకోర్సు ప్రిన్సిపాల్ ఎన్.శివనాగేశ్వరరావు ఆధ్వర్యంలో భారీర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిటి సత్యవతి, ఎంపిడిఒ తిరుపతిరావు, విఆర్‌ఒలు, కార్యదర్శులు, ఎన్‌ఎస్‌ఎస్ పిఒ రాగూర్, వైస్ ప్రిన్సిపాల్ పైలి శశిధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్ : ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



రణస్థలం : అమ్మాజీకి సన్మానం చేస్తున్న ఎమ్మెల్యే, అధికారులు



బూర్జ : ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

శ్రీకాకుళం అర్బన్ : అర్హులైన ప్రతిఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగ పర్చుకోవాలని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్య చంద్రరావు అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యాన ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పి.శంకరనారాయణ, అకడమిక్ కో-ఆర్డినేటర్ సిహెచ్ కృష్ణారావు, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎ.మోహన్‌రాజు, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు పి.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మానవహారం నిర్వహించారు.

లావేరు: బుడుమూరు ఉన్నత పాఠశాలలో ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఓటు ప్రాధాన్యతను వివరించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో సెక్రటరీ అప్పలనాయుడు, విఆర్‌ఒ అనిల్ కుమార్, ఎపి ఎన్‌జిసి కో-ఆర్డినేటర్ గోవిందరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని మెట్టక్కివలసలో ఓటర్ల దినోత్సవంపై అవగాహన కల్పించారు. బిఎల్‌ఒ వరలక్ష్మి ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ నాగళ్ల మురళీధర్, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే చాలా వరకు ప్రమాదాలను నియంత్రించవచ్చునని రవాణాశాఖ అధికారి ఆర్.గోవిందరాజు అన్నారు. స్థానిక రవాణాశాఖ కార్యాలయంలో ఆటో, టాక్స్, స్కూల్ బస్సు డ్రైవర్లతో రోడ్డు భద్రతపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రైవర్లు నిర్లక్ష్యంగా వాహనాలు నడపరాదన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాలు కండిషన్‌లో ఉంచుకోవాలన్నారు. ప్రయాణికులను, స్కూల్ పిల్లలను తీసుకెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో స్వర్ణబారతి విద్యా సంస్థల చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి, శాంతినికేతన్ విద్యా సంస్థలు చైర్మన్ కృష్ణమూర్తిరెడ్డి, సాయి విద్యా సంస్థల డైరెక్టర్ భానుతేజ పాల్గొన్నారు.

సోంపేట : ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, ప్రయాణికుల భద్రతకు బాధ్యత వహించాలని ఇచ్ఛాపురం మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.గోవిందరాజులు అన్నారు. స్థానిక శైలజ కళ్యాణ మండపంలో రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఆటో యూనియన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సిఐ మంగరాజు, ఎస్ఐ లవరాజు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న గోవిందరావు

రిక్తహస్తాలతో దావోస్ నుంచి వెనుదిరిగిన బాబు

వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

దావోస్ పర్యటనకు వెళ్లడానికి నెలరోజుల ముందు నుంచే సిఎం చంద్రబాబు నానా ఆర్భాటం చేసి దావోస్ నుంచి రిక్త హస్తాలతో చంద్రబాబు వెనుతిరిగారని ఘోర వైఫల్యానికి నిదర్శనమని, సుమారు రూ.90 కోట్లు ప్రజాధనం బూడిద పాలైందని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎల్లో మీడియాతో విజనరీ అని బాకాలు ఊదించుకున్న బాబు దావోస్ నుంచి ఎటువంటి పెట్టుబడులు తీసుకురాలేకపోవడం శోచనీయమన్నారు. పక్క రాష్ట్రం తెలంగాణ సుమారు లక్షా 35 వేల కోట్లు పెట్టుబడులను ఆకర్షించ గలిగిందన్నారు. మన రాష్ట్రంలో కక్ష సాధింపులపై పెట్టిన శ్రద్ధ పాలనపై లేదని విమర్శించారు. మొదటిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన జగన్మోహన్ రెడ్డి తన మొదటి ప్రయత్నంలోనే సుమారు లక్షా 70 వేల కోట్లు పెట్టుబడులు సాధించారని, అప్పట్లో పవన్ కళ్యాణ్ స్వదేశీ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకోవడానికి కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి దావోస్ వరకు వెళ్లాలా అంటూ ఎద్దేవా చేశారని మరి నేడు ఏ ఒప్పందాలు లేకుండా సుమారు రూ.90 కోట్లు ఖర్చుపెట్టి రిక్త హస్తాలతో తిరిగి వచ్చిన చంద్రబాబుపై పవన్ కళ్యాణ్ ఏమీ మాట్లాడడం లేదన్నారు. చంద్రబాబు తన కుమారుడు లోకేష్‌ను జాకీలు పెట్టి లేపే ఎల్లో మీడియా ఏమి రాయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో అయోమయంలో ఉందని రవికుమార్ విమర్శించారు.



మాట్లాడుతున్న రవికుమార్



చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

వి.జి.కె మూర్తికి నివాళి

వజ్రపుకొత్తూరు: సిపిఎం నాయకులు వి.జి.కె మూర్తి మృతి ప్రజాతంత్ర ఉద్యమానికి తీరని లోటు అని సిపిఎం నాయకులు బి.ఆనందరావు అన్నారు. మండలంలోని నగరంపల్లిలో విజికె సంస్మరణసభ టి.భాస్కరరావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముందుగా విజికె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ1985 పలాసలో ఎల్‌ఐసి ఉద్యోగం చేస్తూ ఉద్యోగ, కార్మిక, కర్షక, ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన సంఘలతో కో-ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేసి విస్తృత పోరాటాలు నిర్వహించారన్నారు. అదే స్ఫూర్తితో 2020 వరకు కో-ఆర్డినేషన్ కమిటీలో పనిచేశారన్నారు. జిల్లాలో సిఐటియు నిర్మాణానికి ఎనలేని కృషి చేశారని అన్నారు. మార్క్సిస్టు సిద్ధాంతంపై పట్టున్న వ్యక్తి అని అన్నారు. కార్యక్రమంలో ఎన్.మోహనరావు, బి.సుగుణవతి, రామకృష్ణ, బి.లక్ష్మి, టి.లక్ష్మి, టి.యశోదమ్మ, ఎన్.సోములు, డి.శాంతమ్మ, టి.శాంతమ్మ పాల్గొన్నారు.



అభినందిస్తున్న విప్ అశోక్

అంతర్రాష్ట్ర సైన్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని ఎం.ఎస్.పల్లి మోడల్ స్కూల్‌కు చెందిన ఐదుగురి విద్యార్థినులు బెంగళూరులో నిర్వహించనున్న అంతర్రాష్ట్ర సైన్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శివప్రసాద్ తెలిపారు. పాఠశాలకు చెందిన ఆరాధ్య, శ్రద్ధాంజలి, యాస్మిన్, రితిక, శ్రద్ధాంజలి మహంతిలు సైన్స్ ప్రాజెక్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 1 వరకు నిర్వహించనున్న ఈ పోటీల్లో విద్యార్థులతో పాటు గైడ్ ఉపాధ్యాయుడు బి.సత్యనారాయణ పాల్గొంటున్నట్లు అన్నారు. ఈ మేరకు తమ ప్రాజెక్టు గురించి విద్యార్థులు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ వివరించారు. విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే రాష్ట్రస్థాయిలోనూ మంచి ప్రతి చూపాలని ఆకాంక్షించారు. ప్రభుత్వపరంగా విద్యార్థులకు ఉచిత వసతి, రవాణా సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను ఎంఇఒలు శివరాం ప్రసాద్, చిట్టిబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.



రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

రాష్ట్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. రణస్థలం పంచాయతీ బండిపాలెం బిటి రోడ్డు నిర్మాణ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. అలాగే మండల కేంద్రం జె.ఆర్.పురం వేంకటేశ్వర కాలనీలో రూ.30 లక్షలతో నిర్మాణం చేపట్టిన సిసి రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని గ్రామాలు, కాలనీలు ఇప్పుడు ఎన్‌డిఎ ప్రభుత్వం ఇస్తున్న ఉపాధి నిధులతో కొత్తరూపు దిద్దుకుంటున్నాయన్నారు. సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు అహర్నిశలు కష్టపడి పని చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో లంక శ్యామలరావు, పిన్నింటి భానోజీనాయుడు, పిసిని జగన్నాధం నాయుడు, లంక ప్రభాకర్, కొప్పుశెట్టి లక్ష్మణరావు, నారాయణశెట్టి శ్రీనివాసరావు, కాయిత రమణ, రౌతు అప్పలనాయుడు, దన్నాన మహేష్, దన్నాన చిరంజీవి, తిప్పాన బాబూరావు, చిన్న, వాళ్లే రమణ, వడ్డాది శ్రీను, ముక్కు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక నిర్వహణ తప్పనిసరి

ప్రజాశక్తి- మందస

మహిళా సంఘ సభ్యులు పుస్తక నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని ఎపిఎం పైడి కూర్మారావు అన్నారు. మండలంలోని నారాయణపురం గ్రామ సంఘంలోని సంఘాల పుస్తక నిర్వహణను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొదుపు ఖాతాల్లో నిధులను సక్రమంగా ఉపయోగించుకుని ఆదాయ అభివృద్ధికి యూనిట్లను స్థాపించాలన్నారు. ఉమెన్ లెడ్ ఎంటర్ప్రైజెస్ పేరుతో బ్యాంకులు తక్కువ వడ్డీకే వ్యక్తిగతంగా మహిళలకు యూనిట్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు తయారు చేస్తున్న వస్తువులను ఆన్‌లైన్ డిజిటల్ కామర్స్‌లో నమోదు చేసుకుని మార్కెటింగ్ చేసుకునే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో విఒఎ లోలాక్షి, క్లస్టర్ కో-ఆర్డినేటర్ ముఖలింగం పాల్గొన్నారు.

పన్నులు చెల్లించాలి

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ప్రతిఒక్కరూ అస్తి పన్ను, ఆక్రమణల పన్ను, ఖాళీ స్థలాల పన్నులు, మున్సిపల్ షాపులో ఉన్న వ్యాపారులు బకాయిలు తప్పనిసరిగా ఈ నెల 31 లోగా చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు ఒక ప్రకటనలో కోరారు. బకాయిలు ఉన్న పన్నులు చెల్లించని ఎడలా, ఫిబ్రవరి 1 నుంచి అపరాధ రుసం వసూలు చేస్తామన్నారు. సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఇప్పటికే 90 శాతం మంది మేఫింగ్ చేయించుకున్నారని, మిగిలిన వారూ మ్యాపింగ్ చేయించుకోవాలని సూచించారు.

ముగిసిన క్రీడలు

ప్రజాశక్తి- టెక్కలి

మండలంలోని చాకిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రెండు రోజుల పాటు నిర్వహించిన నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. శనివారం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నికాయిట్ పోటీలు నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని టెక్కలి, కోటబొమ్మాళి, నందిగాం, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాలకు చెందిన 60 పాఠశాలల నుంచి మూడు వందల మంది పాల్గొన్నారు. ముగింపు క్రీడల్లో భాగంగా విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.అనురాధ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పంగ తవిటయ్య, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాడాన నారాయణరావు, వ్యాయామ ఉపాధ్యాయులు కుప్పిలి ప్రకాష్, లక్ష్మణరాజా, వెంటకరమణ, కాపల రఘునాథరావు, కె.కె.రామిరెడ్డి, జగ్గమ్మ, ఆలివేణి, యాగాటి త్రినాథరావు, నాగళ్ల రమేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణే బిహెచ్‌ఆర్‌సి ధ్యేయం



సభ్యత్వాలను అందజేస్తున్న పురుషోత్తం నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నేటి సమాజంలో హక్కుల ఉల్లంఘన పెద్దఎత్తున సాగుతోందని, మానవ హక్కులకు భంగం వాటిల్లకుండా భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ అడ్డుకుంటోందని జాతీయ అధ్యక్షులు పూర్ణచంద్రరావు సాహు చెప్పారు. శనివారం నగరంలోని ఎన్‌జిఒ హోంలో భారతీయ హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ఆయన హాజరై మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కుల మనుగడను ఎల్లప్పుడు కాపాడుకోవాల్సిన బాధ్యత పౌరులపై ఉందన్నారు. ఎక్కడైనా వాటికి భంగం వాటిల్లినపుడు మానవతా దృక్పదంతో కౌన్సిల్ సభ్యులు స్పందించాలన్నారు. ఎపి ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర పూర్వపు ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడు మాట్లాడుతూ దేశంలో అనేక సంఘాలు మానవహక్కులపై పని చేస్తున్నాయన్నారు. మావనహక్కులపై ప్రజలకు చైతన్యవంతులు చేయాలన్నారు. సమావేశంలో కౌన్సిల్ జాతీయ ఉపాధ్యక్షులు తొత్తడి మణికంఠ, ప్రభు, డాక్టర్ మంత్రి వెంకట స్వామి, ప్రమీల, సౌజన్య పట్నాయిక్, అమ్మాజీ, రాయిపల్లి అర్జున్, నర్మదా, లక్ష్మీ, కుసుమ, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా రౌతు సూర్యనారాయణ, ఉపాధ్యక్షునిగా పైడి వరహానరసింహులు, కార్యదర్శిగా గార హేమసుందర్ తదితరులు ఎన్నికయ్యారు.

'ఉల్లాస్' వాలంటీర్లకు శిక్షణ

సోంపేట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉల్లాస్ వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సిహెచ్.ఈశ్వరమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను వాలంటీర్లు సాధించాలన్నారు. శతశాతం అక్షరాస్యత సాధించడంలో కోసం ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఇందుకు సంబంధించిన పుస్తకాలను, మెటీరియల్‌లను వాలంటీర్లకు అందజేశారు. శిక్షణ కార్యక్రమాన్ని వాలంటీర్లంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి వి.వెంకటేశ్వర్లు, ఎపిఎం రవణమ్మ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : శత శాతం అక్షరాస్యతకు కృషి చేయాలని ఎంపిడిఒ రామారావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్‌లో భాగంగా వాలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం ప్రసాదరావు, ఎంఇఒ అప్పారావు పాల్గొన్నారు.



సోంపేట : పుస్తకాలను అందజేస్తున్న అధికారులు



నమోదును పరిశీలిస్తున్న ఎంపిడిఒ తిరుమలరావు

సిఎం ఇంటర్న్‌షిప్ నమోదు ప్రారంభం

ప్రజాశక్తి- కంచిలి

స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ నమోదు కార్యక్రమాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ వి.తిరుమలరావు కోరారు. కంచిలి 2 సచివాలయంలో శనివారం సిఎం ఇంటర్న్‌షిప్ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ నమోదులో 21 నుంచి 24 ఏళ్ల లోపు విద్యార్థులంతా తమ విద్యార్హతలు, ఆధార్, ఫోన్ నంబరు, ఇ-మెయిల్ ఐడిలతో వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ నమోదు ద్వారా ప్రభుత్వం నుంచి ఉపాధి అవకాశాలను పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి రమణమూర్తి, ఇఒపిఆర్‌డి ఈశ్వరి, కార్పొరేషన్ కో-ఆర్డినేటర్ తేజశ్వరావు పాల్గొన్నారు.

ఎఫ్‌పిఒ అధ్యక్షులుగా సుజాత

వజ్రపుకొత్తూరు: రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షునిగా సుజాత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎపిఎం గోడబ ప్రసాదరావు ఆధ్వర్యాన మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం సాధారణ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. అధ్యఓఉలుగా బర్ల సుజాత, ఉపాధ్యక్షునిగా దున్న రాజారావు, సెక్రటరీగా బత్తిన హేమ, జాయింట్ సెక్రటరీగా లండ భోజరాజు, కోశాధికారిగా పోతనపల్లి పద్మావతిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎఫ్‌పిఒ ఇన్‌ఛార్జి సిసి హరిప్రియ, ఎఫ్‌పిఒ ఉపాధ్యక్షులు సత్యనారాయణ, మాజీ అధ్యక్షులు సూరాడ మోహనరావు, అకౌంటెంట్ మాచర్ల సౌజన్య తదితరులు పాల్గొన్నారు.




ఎన్నికైన నూతన కార్యవర్గం



మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ బాలమురళీకృష్ణ

ప్రథమ చికిత్సపై శిక్షణ అవసరం

శ్రీకాకుళం అర్బన్: ప్రమాద సమయాల్లో వైద్యసేవలు అందడానికి వేచి చూడకుండా ప్రథమ చికిత్స నిర్వహించడం వల్ల రోగి ప్రాణాలను కాపాడవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి. బాల మురళీకృష్ణ సూచించారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన నగరంలో ప్రథమ చికిత్సపై ఎనిమిది రోజుల పాటు అందించిన శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన హాజరై పలు సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాలు, విపత్తుల సమయంలో ప్రథమ చికిత్స ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ప్రథమ చికిత్సపై డాక్టర్ శ్రీకాంత్, ప్రోగ్రాం మేనేజర్ గొలివి రమణ తరగతులను నిర్వహించారు. హై బిపి, లో బిపి, గుండెపోటు, సిపిఆర్ ప్రక్రియపై అవగాహనతో పాటు విపత్తుల సమయాల్లో గాయాలకు కట్లు కట్టుట, పాముకాటు, తేలుకాటు, గుండెపోటు, విద్యుత్‌షాక్, రోడ్డు ప్రమాద సమయాల్లో ప్రాణాలను కాపాడేందుకు అవసరమైన చికిత్స అందించారు. అనంతరం సర్టిఫికెట్లును అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సెక్రటరీ బలివాడ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



రాజేష్‌ను అభినందిస్తున్న జన సైనికులు

తాగునీటి సమస్య పరిష్కరించాలి

కవిటి: మండలంలోని డొంకూరులో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోల్ల రాజేష్‌ను జనసైనికులు కోరారు. ఈ మేరకు శనివారం రాజేష్‌ను కలిసి తమ సమస్యలు వివరించారు. డొంకూరు తీర ప్రాంతం అభివృద్ధి చేస్తే పర్యాటక ప్రాంతంగా మారుతుందని, దానికి సహకరించాలని కోరారు. అనంతరం కళింగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రాజేష్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో కృష్ణ, బాలయ్య, జోగారావు, ధర్మారావు, ఢిల్లీ పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికే పశు వైద్య శిబిరాలు


బూర్జ : పశువుకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో పెద్దలంకాం పంచాయతీలో శనివారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కె.గోవిందరావు, నీటి సంఘ చైర్మన్ కె.అచ్చం నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పశువుల కోసం అనేక సంక్షేమ పథకాలు ఏర్పాటు చేస్తుందన్నారు. పాడి రైతులు పశువులను పెంచితే జీవనోపాధిగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

పొందూరు: మండలం కృష్ణాపురంలో పశు వైద్యాధికారి డాక్టర్ కె.దివ్య ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలో 44 మంది పాడి రైతులకు చెందిన 62 పశువులకు వైద్య సేవలను అందించారు. అలాగే 39 లేగ దూడలకు నట్టల నివారణ మందులను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి అంబళ్ల శ్రీనివాస్, జనసేన నాయకులు బాబురావు, పశువైద్య సిబ్బంది అప్పలరాజు, స్వాతి, దిలీపు, శ్రీను, రమణ, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: మండలంలోని కనుగులవలసలో పశు సహాయక సంచాలకులు రోణంకి ఆనందరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశుఆరోగ్య శిబిరాన్ని సర్పంచ్ నూక అప్పల సూరన్నాయుడు (రాజు), ఎంపిటిసి పొన్నాడ అనుసూయ ప్రారంభించారు. పాడి రైతులకు అవసరమైన మందులను పంపిణీ చేశారు. పశువులకు వ్యాధి నిరోధక టీకాలు, పశు పోషకులకు శాస్త్రీయ పశుయాజమాన్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ ధవళ ఆదిలక్ష్మి, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ బొడ్డేపల్లి ఇందిర, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ పప్పల రాంబాయ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని సిరువాడలో శనివారం నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రారంభించారు. పాడి రైతులు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పసువు సంపద పెరిగితే గ్రామాలు ఆరోగ్యకరంగా ఉంటాయన్నారు. వైద్యుల సమక్షంలో పశు వులకు ఎటువంటి వ్యాధి లక్షణాలు సోకాకుండా టీకాలు వేయించారు. అనంతరం పాడి రైతులకు మందులు పంపిణీ చేశారు. అంతకుముందు మండల కేంద్రంలోని కొత్త కొత్తూరులో గోశాలను ప్రారంభించారు కార్యక్రమంలో వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, ఆగతముడి అరుణకుమార్, మాతల గాంధీ, డిడిఎహెచ్ డాక్టర్ రామ్మోహనరావు, ఇఒడిఎల్‌డిఎ సిహెచ్.సత్యప్రకాష్, ఎడి డియల్ డాక్టర్ కిషోర్‌కుమార్, డాక్టర్ సిహెచ్.సుబ్రహ్మణ్యం, జి.నారాయణరావు, డాక్టర్లు బి.శ్రీనివాసరావు, పి.అనిల్, టి.హరికృష్ణ పాల్గొన్నారు.

నందిగాం : గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రవికృష్ణ అన్నారు. మండలంలోని కొత్తగ్రహారం, రాంపురం గ్రామాల్లో శనివారం పశు వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ శిబిరంలో పశువ్యాధి నిర్ధారణ గర్భకోశ వ్యాధి చికిత్సలు, ఏలిక పాములు, నట్టల నివారణ, శాస్త్రీయ యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి గురువెల్లి మన్మథరావు, మాజీ సర్పంచ్ బర్ల కృష్ణమ్మ, ఆర్.రామారావురెడ్డి, గుమ్మడి కురమయ్య పాల్గొన్నారు.


ఆమదాలవలస : లేగ దూడకు మందు వేస్తున్న సర్పంచ్ రాజు


పొందూరు : పాడి రైతులకు మందులను అందజేస్తున్న సిబ్బంది

కోటబొమ్మాళి: మండలంలోని తాటిపర్తి, దుప్పిలపాడు గ్రామాల్లో పశువైద్యాధికారులు డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్, ఎం.ప్రజ్ఞచైతన్యలు పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 104 గొర్రెలకు, 79 మేకలకు నట్టల నివారణ మందులు, 651 గొర్రెలకు, 113 మేకలకు అమ్మవారు టీకాలు, 346 కోళ్లల్లో కొక్కెర వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక సహాయకులు బి.రాంబాబు, సిహెచ్.రాంబాబు పాల్గొన్నారు.

మందస: మండలంలోని అంబుగాం, దున్నవూరు గ్రామాల్లో హరిపురం పశువైద్యాధికారులు దువ్వాడ శ్రీకాంత్, కిల్లి ఉమాభారతి పశువైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో అంబుగాం సర్పంచ్ ప్రతినిధి టి.సవరయ, ఎంపిటిసి ప్రతినిధి దున్న పురుషోత్తం, దున్నవూరు సర్పంచ్ దున్న కృష్ణారావు, బొంగు పురుషోత్తం, శనాపతి కృష్ణారావు, శనాపతి రామారావు, పిచ్చుక షణ్ముకరావు, బొడ్డు పురుషోత్తం పాల్గొన్నారు.

కంచిలి: గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారిని టి.శిరీష కోరారు. మండలంలోని గోకర్ణపురంలో పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 34 దూడలకు యేలిక పాముల నివారణ మందులు వేశారు. అలాగే 14 ఆవులకు గర్భకోస చికిత్సలు నిర్వహించారు. 125 ఆవులకు వ్యాధి నివారణ టీకాలను వేశారు. కార్యక్రమంలో సిబ్బంది హరీష్, విజయ్, అశోక్ పాల్గొన్నారు.


ట్రోఫీని అందుకుంటున్న జశ్వంత్ పాత్రో

తృతీయ స్థానంలో పలాస ప్రాజెక్టు

ప్రజాశక్తి- పలాస

రాష్ట్రస్థాయి సైన్స్ ఫెర్ పోటీల్లో పలాస ప్రభుత్వ పాఠశాల విద్యార్థి జస్వంత్ పాత్రో ప్రదర్శించిన ప్రాజెక్టు తృతీయ స్థానంలో నిలిచిందని హెచ్‌ఎం దాశరధి తెలిపారు. పుదుచేరిలో ఈ నెల 20 నుంచి 25 వరకు నిర్వహించిన సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించారు. భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు జినగ షణ్ముఖరావు మార్గదర్శకత్వంలో 9వ తరగతి విద్యార్థి జస్వంత్ పాత్రో తయారు చేసిన రిజనరేటివ్ బ్రేకింగ్ సిస్టం అనే ప్రాజెక్టు రాష్ట్రస్థాయి విభాగంలో సాధించారని అన్నారు. వీరికి పుదుచేరి స్పీకర్, విద్యాశాఖ మంత్రి చేతుల మీదుగా ట్రోఫీ, ధ్రుపత్రాలు, రూ.వెయ్యి నగదు బహుమతిని అందజేశారు. గెలుపొందిన విద్యార్థికి, గైడ్ టీచర్‌కు అభినందించారు.

సారా రహిత సమాజ స్థాపనకు కృషి

సోంపేట : సారా రహిత సమాజ స్థాపనకు కృషి చేస్తున్నామని ఎక్సైజ్ సిఐ కె.బేబీ ఒక ప్రకటనలో తెలిపారు. నాటుసారా నియంత్రణలో భాగంగా రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబరు 14405ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో నాటుసారా తయారీ వివరాలు తెలిస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. నాటుసారా రహిత సమాజ స్థాపనలో భాగస్వాములు కావాలని కోరారు.

దళిత హక్కుల పరిరక్షణకు చర్యలు

ప్రజాశక్తి- కవిటి

దళితుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి హక్కులకు భంగం కలిగేలా ఎవరైనా ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ మురళీమోహన్ హెచ్చరించారు. మండలంలోని బొరివంక దళితవాడలో సివిల్ రైట్స్ డే సందర్భంగా శనివారం మానవ హక్కులపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళితులకు ప్రభుత్వం కల్పించిన భూములను ఎవరైనా అన్యాక్రాంతం చేయడానికి ప్రయత్నిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. విచారణ అనంతరం దళితులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. అలాగే దళిత గ్రామాల్లో ఎనిమిది నుంచి పీజీ చదివే విద్యార్థులకు వసతి సదుపాయం అవసరమైతే తమ దృష్టికి తీసుకువస్తే వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. సర్పంచ్ బెందాళం శ్రీరామ్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను దళితులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిటిసి దుద్ధి సతీష్ కుమార్, కార్యదర్శి గుణవతి, విఆర్ఒ గుర్రాల దివాకర్, దళిత సంఘ నాయకులు మద్దిలి కేశవరావు, బలగ మోహనరావు, బలగ నారాయణమూర్తి, బలగ దోంబురు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్ మురళీమోహన్

జనసేన జెండా ఆవిష్కరణ


జెండాను ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని చిగురువలసలో జనసేన నాయకుల ఆధ్వర్యంలో జనసేన జెండాను జనసేన జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహన్, మండల అధ్యక్షులు పైడి మురళి మోహన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో యువత జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలకు ఆకర్షితులై, జనసేన పార్టీలో సేవలందిస్తూ నేడు గ్రామ గ్రామాల్లో జనసేన పార్టీని ప్రజలకు చేరువ చేస్తున్నారన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయితీరాజ్ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటినుంచి రాష్ట్రంలో పల్లెలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయని తెలిపారు. జనసేన శ్రేణులు కూటమి పార్టీలకు సహకరిస్తూనే జనసేన పార్టీని బలపేతం చేసే దిశగా, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పొందూరు మండల అధ్యక్షులు ఎలకల రమణ, జిల్లా కార్యదర్శి కోరుకొండ మల్లేశ్వరరావు, జన సైనికులు తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాలు అందిస్తున్న విప్ అశోక్

అక్షర వెలుగులు విరజిమ్మాలి

ప్రజాశక్తి- కవిటి

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేక్రమంలో గ్రామాల్లో అక్షర వెలుగులు విరజిమ్మాలని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ఆకాంక్షించారు. ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా మొదటి విడతలో సుమారు 2046 మందికి శనివారం పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక మహిళా సమైక్య భవనంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎం గోవిందరావు మాట్లాడుతూ ప్రతి పది మంది నిరక్షరాస్యులకు ఒక వాలంటీర్ చొప్పున నియమించి ఉల్లాస్ కార్యక్రమం అమలు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, మండల మహిళా సమైక్య కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


పుస్తకాలను అందజేస్తున్న హెచ్ఎం శ్రీధర్‌పాత్రో

నోటు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి- పలాస

మండలంలోని లొత్తూరు గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే గౌతు శిరీష పాఠశాలకు అందజేసిన నోటు పుస్తకాలను ప్రధానోపాధ్యాయుడు అన్నెపు శ్రీధర్‌పాత్రో పంపిణీ చేశారు. గిరిజన విద్యార్థులకు పుస్తకాలు ఉచితంగా అందజేయాలని ఉద్దేశంతో ఆమె అందజేసిన నోటు పుస్తకాలను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఎస్.తిరుపతిరావు, సర్పంచ్ ప్రతినిధి సీమాన్, రామకృష్ణ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న విప్ అశోక్

కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కవిటి

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ కేలండర్‌ను ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని మీటర్ రీడర్లు విప్‌ని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు.ఈ కార్యక్రమంలో ఎపి విద్యుత్ మీటర్ రీడర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి దూగాన భాస్కర్, యునియన్ కోశాధికారి జి.ప్రేమ్‌భూషణ్‌రెడ్డి, గొనప ఆనంద్‌కుమార్, కె.మనోహర్, మీటర్ రీడర్లు తదితరులు పాల్గొన్నారు.